సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 7 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.15 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



హతమార్చి..ఆపై కాల్చేసి

సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాను తలపించేలా జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. స్నేహితుడే అంతమొందించినట్లు గుర్తించి నిందితులను అరెస్టు చేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
33.8°/ 18.4°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఉదయం చలి కొనసాగింది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో వాయువ్య దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఈఆర్‌ఓలకు శిక్షణ తరగతులు

పుట్టపర్తి అర్బన్: ఎన్నికల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు (ఈఆర్‌ఓ) గురువారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలోని శ్రీనివాస కల్యాణ మంటపంలో నిర్వహించే శిక్షణ తరగతులకు ఈఆర్‌ఓలంతా హాజరు కావాలన్నారు.

'సాయుధ' నిధికి విరాళాలివ్వండి

పుట్టపర్తి అర్బన్: దేశరక్షణలో కీలకమైన సాయిధ దళాల ప్రత్యేక నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో కోరారు. ఏటా డిసెంబర్‌లో దేశ వ్యాప్తంగా సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటామని గుర్తుచేశారు. యుద్ధంలో మృతి చెందిన సైనికుల కుటుంబాలు, పదవీ విరమణ పొందిన జవానుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమవంతు సాయం అందించాలన్నారు. అలాగే గురువారం కలెక్టరేట్‌లో వీర జవానుల త్యాగ నిరతిని స్మరించుకునే త్రివిధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

నకిలీ బంగారం విక్రేతల అరెస్ట్

- 2 కేజీల నకిలీ బంగారం, రూ.7.5 లక్షల నగదు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ రాజశేఖర్

తనకల్లు: తక్కువ ధరకే బంగారం ఇస్తామంటూ మాయ మాటలు చెప్పి అమాయకులకు నకిలీ బంగారాన్ని అంటగడుతున్న ముగ్గురు సభ్యులున్న ముఠాను తనకల్లు పోలీసులు అరెస్టు చేశారు. ముఠా వద్ద నుంచి నకిలీ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు విలేకరులకు తెలిపారు. శ్రీకాళహస్తికి చెందిన భూక్యా వెంకటేష్, అన్నమయ్య జిల్లా శికారిపాలెంకు చెందిన రాణా విజయకృష్ణ, చిత్తూరు జిల్లా ఎంపెడుకు చెందిన భూక్యా నరేష్, చిన్న బుజ్జి అలియాస్ గుండు అనే వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు నకిలీ బంగారాన్ని విక్రయించాలని ప్లాన్ వేశారు. ఈ క్రమంలోనే రెండు వారాల క్రితం తనకల్లులో తాళ్లూరు దుర్గారావుకు తమ వద్ద రెండు కేజీల బంగారం ఉందని, దాన్ని తక్కువ ధరకే అమ్ముతామని నమ్మించారు. వీరి మాటలు నమ్మిన దుర్గారావు వారికి రూ. 13.75 లక్షలు ఇచ్చి బంగారం కొనుగోలు చేశాడు. అనంతరం దాన్ని పరీక్షించగా నకిలీదని తేలింది. దీంతో బాధితుడు ఈ నెల 5వ తేదీన తనకల్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చేపట్టారు. బుధవారం మండలంలోని చీకటిమానిపల్లి వద్ద నకిలీ బంగారాన్ని విక్రయించే వ్యక్తులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ రాజశేఖర్, హెడ్‌కానిస్టేబుల్ రాధాకృష్ణ, కానిస్టేబుళ్లు నారాయణస్వామి, ఆంజనేయులు వెంటనే చీకటిమానిపల్లికి వెళ్లారు. పోలీసులను చూడగానే బుజ్జి అలియాస్ గుండు అక్కడి నుంచి పరారీ కాగా, మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా నకిలీ బంగారం విక్రయించినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 2 కేజీల నకిలీ బంగారంతో పాటు రూ. 7.5 లక్షలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఆయువు నిలిపిన ఆరోగ్యశ్రీ

- టీడీపీ పాలనలో పథకం నిర్వీర్యం
- ఉమ్మడి జిల్లాలో 99 వేలమందికే లబ్ధి
- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పటిష్టం
- గడిచిన నాలుగున్నరేళ్లలో 3.73 లక్షల మందికి వైద్య సేవలు
- ఆరోగ్య ఆసరా కింద 1.78 లక్షల మంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా
- ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఆరోగ్యశ్రీపై 'ఈనాడు' తప్పుడు రాతలు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నాలుగున్నరేళ్లకు ముందు రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం కింద సరైన వైద్యం లభించక బాధితులు పడిన వేదన అంతా ఇంతా కాదు. ముఖ్యంగా మెట్ట వ్యవసాయం, కూలిపనులను నమ్ముకుని బతుకీడుస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉండేది. నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులు లేకపోవడంతో ఏ ఆస్పత్రికెళ్లినా బాధితులను చూసి ఈసడించుకోవడమే. క్యాన్సర్, గుండెజబ్బు బాధితులు ఇతర రాష్ట్రాలకు వెళితే వైద్యం అందేది కాదు. ఇలా ఒకటి కాదు రెండు కాదు రకరకాల సమస్యలతో బాధితులకు ఐదేళ్ల కాలం ఐదు యుగాలుగా గడిచింది. 2019 మే 30న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. రకరకాల జబ్బులతో బాధపడుతూ చికిత్సలకు ఎదురుచూస్తున్న వారికి ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టం చేసి ఉచిత వైద్యం అందుబాటులోకి తెచ్చింది. ఎంతోమంది పేదలకు సకాలంలో వైద్యం అందడంతో ఆయుష్షు పెరిగింది.

భారీగా చికిత్సలు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఆంక్షలు తొలగిపోయాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేలాది మంది హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వెళ్లి చికిత్సలు చేసుకునే వెసులుబాటు లభించింది. 1,044 మాత్రమే ఉన్న ప్రొసీజర్ల సంఖ్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 3,256కు పెంచింది. దీంతో ఏ జబ్బు వచ్చినా నిర్భయంగా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకునే అవకాశం దక్కింది. తెలుగుదేశం పార్టీ హయాంలో అనంతపురం జిల్లాకు 2014–19 మధ్య కాలంలో రూ.275.57 కోట్లు ఆరోగ్యశ్రీ కింద వ్యయం చేయగా.. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.673.02 కోట్ల వ్యయం చేశారు. అప్పట్లో లబ్ధిదారులు 99వేల మంది పైచిలుకు మాత్రమే ఉంటే.. ఈ ప్రభుత్వ హయాంలో 3.73 లక్షలకు పై చిలుకు పెరిగారు.

భరోసా ఇచ్చిన ఆసరా

వైఎస్సార్ ఆరోగ్య ఆసరా.. ఇలాంటి పథకం దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. చికిత్స అనంతరం కుటుంబ పెద్ద మంచం మీద ఉంటే పోషణ కష్టమన్న భావనతో కోలుకునే వరకూ రోజుకు గరిష్టంగా రూ.225 లెక్కన ఇస్తోంది. ఇలా ఈ నాలుగున్నరేళ్లలో ఆరోగ్య ఆసరా కింద ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1.78 లక్షల మంది లబ్ధిపొందగా, దీనికోసం రూ.91.32 కోట్ల వ్యయం చేశారు.

ఈనాడు తప్పుడు రాతలు

రాష్ట్రవ్యాప్తంగా గుండె జబ్బులకు చికిత్స సరిగా జరగడం లేదని, ఇక్కడ ప్యాకేజీలు తక్కువగా ఉన్నాయని ఈనాడు పత్రిక అచ్చు వేసింది.

టీడీపీ హయాంలో ఉమ్మడి అనంత జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు	
కాల వ్యవధి	2014-2019
మొత్తం చికిత్సలు	1,044
లబ్ధిదారుల సంఖ్య	99,895
ఆరోగ్యశ్రీ వ్యయం	రూ.275.57 కోట్లు
ఆరోగ్య ఆసరా	0

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలు	
కాల వ్యవధి	2019-2023
మొత్తం చికిత్సలు	3,256
లబ్ధిదారుల సంఖ్య	3,73,735
చేసిన వ్యయం	రూ.673.02 కోట్లు
వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులు	1,78,165
ఆసరాకు చేసిన వ్యయం	రూ.91.32 కోట్లు

కానీ వాస్తవంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒక్క గుండె చికిత్సలకే రూ.129.34 కోట్లు వ్యయం చేసింది. దీన్నిబట్టి ఇక్కడ గుండెజబ్బు బాధితులు ఎలా లబ్ధి పొందారో అంచనా వేయచ్చు. ఇవేమీ చూడకుండా ప్యాకేజీలు తక్కువని, ప్రైవేటు ఆస్పత్రులు ఒప్పుకోవడం లేదంటూ 'ఈనాడు' తప్పుడు కథనంతో ప్రభుత్వంపై బురదజల్లే రాతలు రాసింది.

బెదిరింపు కేసులో మంజునాథ్‌కు రిమాండ్

- 'చౌళూరు' హత్య కేసులో నిందితుడు
- బెయిల్‌పై వచ్చాక బెదిరింపుల పర్వం
- అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు



మంజునాథ్ (ఫైల్)

హిందూపురం అర్బన్: వైఎస్సార్ సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డితో పాటు మరికొందరిని బెదిరించిన కేసులో చౌళూరు గ్రామానికి చెందిన మంజునాథ్‌ను బుధవారం హిందూపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ తెలిపిన వివరాల మేరకు...చౌళూరు గ్రామానికి చెందిన బడన్న గారి మంజునాథ్ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన పలు రాబరీ, దొమ్మీ కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకుడు చౌళూరు రామకృష్ణారెడ్డి హత్య కేసులోనూ నిందితుడు. దీంతో పోలీసులు అతన్ని జైలుకు పంపగా, బెయిల్‌పై విడుదలయ్యాడు. బయటకు వచ్చిన తర్వాత చౌళూరు రామకృష్ణారెడ్డి సోదరి మధుమతిరెడ్డి, ఆమె బంధువులకు సామాజిక మాధ్యమాల ద్వారా వీడియోలు పంపి భయభ్రాంతులకు గురిచేశాడు. అలాగే చౌళూరు రామకృష్ణారెడ్డి హత్య కేసులో సాక్షులను సైతం బెదిరించాడు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయగా, హిందూపురం రూరల్ పోలీసులు మంజునాథ్‌పై కేసు నమోదు చేసి..అతని వ్యవహార శైలిపై నిఘా ఉంచారు. బాధితుల ఫిర్యాదులో పేర్కొన్న విషయాలన్నీ నిజమని తేలడంతో మంజునాథ్ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం చెక్‌పోస్టు వద్ద ఉన్నట్లు తెలియడంతో రూరల్ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది అక్కడికి వెళ్లి మంజునాథ్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జడ్జి ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి

- శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా విధులు
- హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవంలో ఎస్పీ మాధవరెడ్డి



ప్లటూన్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా పనిచేస్తున్న హోంగార్డుల సేవలు వెలకట్టలేనివని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 61వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాధవరెడ్డి... ముందుగా సాయుధ హోంగార్డుల ప్లటూన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... పోలీసింగ్‌లో భాగమైన హోంగార్డుల వ్యవస్థ 1963 డిసెంబర్ 6న తేదీన ఏర్పడిందన్నారు. హోంగార్డులు శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్, కమాండ్ కంట్రోల్ రూమ్, క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, పోలీస్ బ్యాండ్ విభాగాలతో పాటు ఫైర్, రైల్వేస్, ఏపీఎస్పీ, ఆర్టీసీ, జ్యుడీషియల్ శాఖల్లోనూ సేవలందిస్తున్నారన్నారు. ప్రస్తుతం జిల్లాలో 308 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోలీసులతో సమానంగా హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. విధి నిర్వహణలో అమరులైన వారి కుటుంబీకులకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వడంతో పాటు కారుణ్య నియామకం కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తున్నారన్నారు. ప్రమాద బీమా కూడా రూ.10 లక్షలకు పెంచారన్నారు. మహిళా హోంగార్డులకు 3 నెలలు ప్రసూతి సెలవులు, కుమార్తె పెళ్లికి రూ.5 వేల సాయం, నెలకు రెండు రోజుల వేతనంతో కూడిన సెలవులు, పిల్లలకు మెరిట్ స్కాలర్ షిప్, మృత్యువాత పడిన హోంగార్డులకు తక్షణం రూ.20 వేలు ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

విజేతలకు బహుమతులు..

కార్యక్రమంలో భాగంగా వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన పలువురు హోంగార్డులకు ఎస్పీ మాధవరెడ్డి, ప్రశంసా పత్రాలు, మెమొంటోలు ప్రధానం చేశారు. పదవీ విరమణ పొందిన హోంగార్డులను సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, దిశ డీఎస్పీ వరప్రసాద్, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు టైటాస్, రాజశేఖర్‌రెడ్డి, నారాయణతో పాటు ఆర్‌ఎస్‌ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

చమన్‌ను చంపించి..

ఫొటోకు దండం పెడతావు

- సేవలు చేసిన వారినే మట్టుబెడతారు
- ఓటు అడిగే అర్హత మీకు ఏమాత్రమూ లేదు
- పరిటాల సునీతపై రాప్తాడు నియోజకవర్గ వాసుల ధ్వజం



మాట్లాడుతున్న నసనకోట ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసు, రామాంజనమ్మ

రాప్తాడురూరల్: అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలోని పేదలకు పరిటాల సునీత చేసిందేమీ లేదని కనగానపల్లి మండలం తగరకుంటకు చెందిన రామాంజనమ్మ స్పష్టం చేశారు. పరిటాల రవి తండ్రి పరిటాల శ్రీరాములు హత్య జరిగిన సమయంలో అడ్డుకోబోయిన తనతండ్రి వాల్మీకి రామాంజనేయులు కూడా ప్రాణాలు కోల్పోయాడని ఆమె తెలిపారు. ఈ నెల 4న రాప్తాడులో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు బ్రహ్మరథం పట్టడాన్ని జీర్ణించుకోలేని పరిటాల సునీత తన వర్గీయులతో ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. బుధవారం ఆమె అనంతపురంలో నసనకోట హరిజన ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పరిటాల కుటుంబానికి వెన్నంటి ఉండి సేవలందించిన చమన్‌సాబ్‌ను చంపించి.. మళ్లీ ఆయన ఫొటోకు సునీత దండం పెడుతోందని మండిపడ్డారు. బీసీలకు ఎంతగా అన్యాయం చేశావో అందరికీ తెలుసన్నారు. ఆమెను ఏ ఒక్కరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పరిటాల సునీత కలలో కూడా ఎమ్మెల్యే కాబోదన్నారు. ప్రజలను ఓట్లు అడిగే అర్హత పరిటాల కుటుంబానికి లేదని నసనకోట హరిజన ముత్యాలు, కుంటిమద్ది ఓబులేసు స్పష్టం చేశారు. పరిటాల కుటుంబ రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యేతోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన్నారు.

నోటీసులిచ్చాకే ఓటు తొలగింపు

- ఓటరు జాబితాలో తప్పులు దొర్లకూడదు
- ఎన్నికల అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

ధర్మవరం అర్బన్: ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా అందే క్లెయిమ్‌లన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని, ముఖ్యంగా ఫారం–7 ద్వారా ఓటు తొలగించాల్సి ఉన్నప్పుడు తప్పనిసరిగా నోటీస్–13, 14 జారీ చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా తయారీలో ఒక్క తప్పు కూడా దొర్లకూడదన్నారు. బుధవారం ఆయన ధర్మవరం ఆర్డీఓ కార్యాలయం సమావేశ భవనంలో డివిజన్ పరిధిలోని సహ ఎన్నికల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నిబంధనలన్నీ పాటించాలన్నారు. సరైన కారణం లేకుండా ఒక్క ఓటు కుడా తొలగించకూడదన్నారు. మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి రిజిస్టర్లు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఓటు బదిలీ విషయంలో అత్యంత జాగ్రత్త వహించాలని, ఎవరైనా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి తమ ఓటును బదిలీ చేసుకుంటామని కోరితే... ఎక్కడి నుంచి మార్చుకోవాలని భావిస్తున్నారో అక్కడ వారికి ఓటు లేకుండా చూడాలన్నారు. జంక్ క్యారెక్టర్లు, 10 ఓట్లుపైగా ఉన్న వాటి మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎవరైనా ఎక్కువగా దరఖాస్తులు సమర్పించినట్లయితే తగిన



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఆధారాలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బీఎల్‌ఓలు పోలింగ్‌స్టేషన్‌లో తప్పనిసరిగా ఉండాలని, ఈమేరకు ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు తగు చర్యలు తీసుకోవాలన్నారు. క్లెయిమ్‌ల స్వీకరణకు డిసెంబర్ 9వ తేదీ చివరి తేదీ అన్న విషయం అందరూ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, ఆర్డీఓ రమేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సేవలను పొగిడినందుకు దాడి

- రుద్రంపేటలో ఘటన
- పరిటాల సునీత వర్గీయుల ఘాతుకం



మాట్లాడుతున్న సుధీర్‌చౌదరి

రాప్తాడురూరల్: రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న సేవల గురించి పొగిడిన వ్యక్తిపై పరిటాల సునీత వర్గీయులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్మూర్తినాయుడు బంధువులు దాడి చేశారు. బాధితుడి కథనం మేరకు... రామగిరి మండలం మాదాపురానికి చెందిన పతకమూరి సుధీర్ చౌదరి తదితరులు ఐదు రోజుల కిందట కనగానపల్లిలో జరిగిన సభలో పాల్గొన్నారు. ఆ సమయంలో సుధీర్ మాట్లాడుతూ.. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే కాక ముందు, అయిన తర్వాత ఏయే సేవలందించారో వివరించాడు. ఎనుములు, గొర్రెలు, డ్రిప్ ఉచితంగా అందివ్వడంతో పాటు బోర్లు వేయించారని గుర్తు చేశాడు. చదువుకున్న వ్యక్తి ఎమ్మెల్యే అయితే ప్రకాష్ రెడ్డిలా ఉంటారని వ్యాఖ్యానించాడు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి రెడ్డి సామాజిక వర్గం నేతను మెచ్చుకోవడాన్ని పరిటాల వర్గీయులు ఓర్వలేకపోయారు. మంగళవారం రాత్రి అనంతపురం రుద్రంపేటలో సుధీర్‌చౌదరి నివాసానికి వెళ్లిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామ్మూర్తి నాయుడు బంధువులు అనిల్, వెంకట్ తదితరులు దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితుడు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

నేడే సామాజిక సాధికార బస్సుయాత్ర

- మడకశిర వైఎస్సార్ సర్కిల్‌లో ఏర్పాట్లు పూర్తి
- తరలిరానున్న రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- తొలుత మేధావుల సదస్సు... అనంతరం బైక్ ర్యాలీ
- మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్ సర్కిల్‌లో బహిరంగ సభ



మడకశిరలోని వైఎస్సార్ సర్కిల్‌లో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన మేలును వివరించేందుకు వైఎస్సార్ సీపీ చేపట్టిన బస్సుయాత్ర గురువారం మడకశిరలో కొనసాగనుంది. వైఎస్సార్ సీపీకి చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సామాజిక సాధికార సభలో పాల్గొననున్నారు. తొలుత ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని సరస్వతీ విద్యామందిరంలో మేధావుల సదస్సును ఏర్పాటు చేశారు. సదస్సు అనంతరం సరస్వతీ విద్యామందిరం నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు బస్సుయాత్ర కొనసాగనుంది. మధ్యాహ్నం 12 గంటలకు వైఎస్సార్ సర్కిల్‌లో సభ ప్రారంభం కానుంది. బస్సు యాత్ర సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ కూడా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్ల పరిశీలన..

మడశిర పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో కొనసాగుతున్న సామాజిక సాధికార బస్సుయాత్ర సభ ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి పరిశీలించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...జిల్లా ఇన్‌చార్జ్‌మంత్రి గుమ్మనూరు జయరాం, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ బస్సుయాత్రలో పాల్గొంటారన్నారు. అదే విధంగా హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జిల్లా చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీ చైర్‌పర్సన్ కూడా హాజరవుతారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ లోకేష్, ప్రజాప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కౌన్సిలర్లు, వివిధ కమిటీల సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హతమార్చి... ఆపై కాల్చేసి

- సినిమాను తలపించిన యువకుడి హత్య
- ఎట్టకేలకు మిస్టరీని ఛేదించిన పోలీసులు
- 11 మంది అరెస్ట్
- కారు, ద్విచక్ర వాహనాలు, ల్యాప్‌టాప్, మొబైల్‌ఫోన్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్ (చిత్రంలో) డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ రెడ్డప్ప



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

అనంతపురం క్రైం: వారిద్దరూ స్నేహితులు. కలిసి వ్యాపారం చేసి కష్టాల నుంచి గట్టెక్కారు. అయితే ఊహించని విధంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో కారణం నువ్వంటే నువ్వని నిందించుకున్నారు. అక్కడితో ఆగని ఆక్రోశం చివరకు ఒకరిని మట్టుబెట్టే స్థాయికి చేరుకుంది. ఆద్యంతం క్రైమ్... సస్పెన్స్... థ్రిల్లర్ సినిమాను తలపించేలా సాగిన యువకుడి హత్యకేసులో మిస్టరీని కేవలం వారం రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. నిందితులను కటకటాల వెనక్కు పంపారు. వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వెల్లడించారు.

మిస్సింగ్ కేసు కింద దర్యాప్తు..

అనంతపురంలోని మున్నానగర్‌కు చెందిన మహమ్మద్ ఆలీ (27) గత నెల 27న మిత్రులతో కలసి బెంగళూరుకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఫోన్ నంబర్‌కు కాల్ చేసినా స్పందన లేకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు ఈ నెల 1న వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసిన సీఐ రెడ్డప్ప, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, సుధాకర్ యాదవ్.. డీఎస్పీ ప్రసాదరెడ్డి నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ఏఎస్ఐ నాగేశ్వరరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్, ఫరూక్ , అశ్వత్థ, కానిస్టేబుళ్లు మహమ్మద్, ఆసిఫ్, దాసు, మురళి, మోహన్, అమీర్ బృందాలుగా విడిపోయి అండర్ కవర్ ఆపరేషన్ చేపట్టారు. కేసులో తొలుత అనుమానితుడి మహమ్మద్ రఫీక్‌ను అదుపులోకి తీసుకుని, తమదైన శైలిలో విచారణ చేయడంతో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం చేసుకుని ఆలీని హతమార్చి, మృతదేహాన్ని కాల్చేసినట్లు అంగీకరించాడు. దీంతో మిస్సింగ్ కేసును కాస్త హత్య కేసుగా మార్చి లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మొత్తం 11 మంది నిందితులూ పట్టుబడ్డారు.

పట్టుబడింది వీరే..

మహమ్మద్ ఆలీని హతమార్చిన కేసులో తొలుత అనుమానితుడిగా పోలీసులకు పట్టుబడిన అనంతపురంలోని చంద్రబాబు కొట్టాలకు చెందిన మహమ్మద్ రఫీకే ప్రధాన నిందితుడిగా పోలీసులు నిర్ధారించారు. అతనికి సాయం చేసిన మరో పది మందిని పక్కా ఆధారాలతో బుధవారం అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో రఫీక్‌తో పాటు సమీప కుటుంబసభ్యులు అనంతపురంలోని వినాయక్ నగర్‌కు చెందిన షేక్ కరిష్మా, షేక్ సిద్దిక్ ఆలీ, చంద్రబాబు కొట్టాలకు చెందిన షేక్ గౌసియా, రాజీవ్ కాలనీకి చెందిన షాహీనా, మూడో రోడ్డులో నివాసముంటున్న శెట్టూరు మండలం ములకలేడుకు చెందిన కరణం శ్రీనివాస్ ఫణి, శ్రీసత్యసాయి జిల్లా, బత్తలపల్లి మండలం సంగాల నివాసి గుజ్జల శివకుమార్ (సుపారీ గ్యాంగ్‌లీడర్), గుజ్జల హరి, నార్సింపల్లి నివాసి గుజ్జల చంద్రశేఖర్, గుజ్జల కృష్ణ, ప్రస్తుతం ధర్మవరంలో నివాసముంటున్న తాడిమర్రి మండలానికి చెందిన మంగలి కేసన్నగారి రాము అలియాస్ శివరాం ఉన్నారు. వీరి నుంచి మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన నానో కారుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, ఓ లాప్‌టాప్, ఐదు మొబైల్ ఫోన్లు, రూ.35 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు.

వివాదంగా మొదలై...

షేక్ మహమ్మద్ రఫీక్, మహమ్మద్ ఆలీ మంచి స్నేహితులు. ఇద్దరూ కలసి రియల్ ఎస్టేట్, పాల్కాన్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్ ట్రేడింగ్ కంపెనీ తదితర వివిధ రకాల వ్యాపారాలు చేశారు. ఊహించని విధంగా మార్కెట్‌లో వీరు చేస్తున్న వ్యాపారాలకు డిమాండ్ తగ్గడంతో రూ.లక్షల్లో నష్టపోయారు. ఇందుకు కారణం నీవంటే... నీవంటూ నిందించుకుని, నష్టపోయిన డబ్బును రాబట్టుకునేందుకు ఇద్దరూ పరస్పరం వాగ్వాదానికి దిగేవారు. దీనికి తోడు ఆలీ తరుచూ తన ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులతో వ్యవహరిస్తున్న తీరు కూడా రఫీక్‌లో ఆవేశానికి కారణమైంది. దీంతో వ్యాపారంలో నష్టపోయిన డబ్బు ఎగ్గొట్టడంతో పాటు తన కుటుంబసభ్యుల ప్రశాంత జీవనానికి ఆలీని అడ్డు తప్పించడం ఒక్కటే మార్గంగా భావించాడు.

హత్య చేశారిలా..

ఆలీని హతమార్చాలని నిర్ణయించుకున్న రఫీక్ వెంటనే తన స్నేహితుడు మంగలి కేసన్న గారి రాము అలియాస్ శివరాం సాయాన్ని అర్థించాడు. దీనికి అంగీకరించిన శివరాం తనకు బాగా తెలిసిన సుపారీ గ్యాంగ్‌ను పంపుతానని రూ.50 వేలు అడ్వాన్సు కింద తీసుకుని గుజ్జల శివకుమార్, చంద్రశేఖర్, హరి, కృష్ణను నవంబరు 27న అనంతపురానికి పంపాడు. ఈ నలుగురూ రఫీక్‌తో కలసి మాట్లాడిన తర్వాత వినాయక నగర్‌లోని తన బావ సిద్దిక్ ఆలీకి చెందిన ఫర్నీచర్ గోదాము వద్దకు రావాలని మహమ్మద్ ఆలీకి రఫీక్ ఫోన్ చేశాడు. దీంతో అక్కడకు చేరుకున్న ఆలీపై సుపారీ గ్యాంగ్‌తో కలసి దాడి చేసి కొట్టి, కాళ్లుచేతులు కట్టేశారు. నోటికి, ముక్కుకు ప్లాస్టర్ అతికించి సుపారీ గ్యాంగ్ సభ్యులు వెళ్లిపోయారు. తర్వాత కాసేపటికి ఆలీ చనిపోయినట్లుగా గుర్తించిన రఫీ వెంటనే సిద్దిక్ ఆలీ, కరిష్మాతో చర్చించి మృతదేహాన్ని మాయం చేయడానికి పథకం వేశాడు.

కారు మొరాయించి... తిరిగొచ్చి

గత నెల 27న ఆలీని హతమార్చిన రోజే మృతదేహాన్ని నానో కారులో తీసుకుని నంద్యాల జిల్లా గిద్దలూరు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో పడేసేందుకు రఫీక్, కరిష్మా బయల్దేరారు. మార్గమధ్యంలో కారు మొరాయిస్తుండడంతో వెనక్కు వస్తుండగా శింగనమల మండలం శివపురం వద్దకు చేరుకోగానే కారు ఆగిపోయింది. స్థానికులు గమనించి రోడ్డుపై ఆగిన కారును పక్కకు లాగారు. ఆ సమయంలో వెనుక సీటులో ఉన్న మృతదేహాన్ని గమనించి ఆరా తీయడంతో తమ సోదరుడే మృతి చెందాడని నమ్మించారు. అనంతరం అంబులెన్స్‌ను రప్పించుకుని మృతదేహాన్ని అనంతపురంలోని నారాయణపురం ఇందిరమ్మ కాలనీలో తాను నూతన నిర్మిస్తున్న ఇంటికి రఫీక్ చేర్చాడు. అప్పటికే చాప, దుప్పటి తెప్పించి మృతదేహం కనపడకుండా కప్పి ఆ ఇంట్లో ఉంచారు. చుట్టుపక్కల ఆరా తీయడంతో తమకు అతి సమీప బంధువు చనిపోయాడని, కుష్టు వ్యాధి ఉండడంతో మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చినట్లుగా నమ్మించారు. అనంతరం నవంబర్ 28వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత ఆలీ మృతదేహాన్ని నారాయణపురం సమీపంలోని శ్మశాన వాటికకు తీసికెళ్లి పెట్రోలు పోసి ఆనవాళ్లు లేకుండా కాల్చేశారు.మృతదేహాన్ని తరలించేందుకు వినియోగించిన కారును షాహీనా, కరణం శ్రీనివాస్‌ఫణి సాయంతో దాచేశారు. కేసులోని మిస్టరీని ఛేదించి 11 మంది నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ రెడ్డప్ప బృందాన్ని ఎస్పీ అన్బురాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

క్లుప్తంగా

11న పీఎం నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా

లేపాక్షి: ఈ నెల 11న లేపాక్షిలోని ప్రభుత్వ ఐటీఐలో పీఎం నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఐటీఐ కళాశాలల కన్వీనర్ రాయపురెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఉత్తీర్ణులైన వారు పదో తరగతి, ఐటీఐ మార్కులు కార్డు, ఎన్‌టీసీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోలు, బ్యాంకు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలి. పూర్తి వివరాలకు 94402 58629లో సంప్రదించవచ్చు.

కారు ఢీ - వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యురాలు

అగళి: కారు ఢీకొన్న ఘటనలో ఓ పాదచారి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... అగళి మండలం రామన్నపల్లికి చెందిన కాలజ్జీర నరసింహప్ప మూడో కుమారుడు రమేష్ (45) బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటి వద్ద ఉన్న పశువుల కోసం గడ్డివామి నుంచి గ్రాసం తీసుకుని రోడ్డు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన కారు ఢీకొంది. ఘటనలో దాదాపు కొన్ని అడుగుల దూరం లాక్కెళ్లడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ లావణ్య అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్, పరిగికి చెందిన వంశీకుమార్‌ని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఫార్మా-డీ ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో నిర్వహించిన ఫార్మా-డీ ఒకటో సంవత్సరం (ఆర్-17) రెగ్యులర్, సప్లిమెంటరీ, (ఆర్-14) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి.చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఫలితాలను జేఎన్‌టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

భావితరాలకు మార్గదర్శి అంబేడ్కర్



బీఆర్ అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: భారతదేశానికి రాజ్యాంగాన్ని రచించి భావితరాలకు మార్గదర్శకుడిగా నిలిచిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో పలువురు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివరంగప్రసాద్ ప్రసాద్‌తో పాటు ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు మోహన్‌రామ్, నిర్మలాజ్యోతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నాగార్జునరెడ్డి

హిందూపురం అర్బన్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా నేరుగా ప్రజల వద్దకెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. హిందూపురం మండలం మణేసముద్రం, కిరికెర సచివాలయాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయ సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయా సచివాలయాల పరిధిలోని పాఠశాలల్లో నాడు-నేడు పనులు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్యాబోధన తీరు, ఉపాధి పనులు పరిశీలించారు. అనంతరం మహిళా సాధికారతపై కిరికెర వీవర్స్ కాలనీలోని స్వయం సంఘాల సభ్యులతో సమావేశమై మాట్లాడారు.

గ్రామ సంఘాలకు రూ.91.76 కోట్లు..

మండల వ్యాప్తంగా 14 పంచాయతీల పరిధిలోని 48 గ్రామాల్లో ఉన్న 1,275 మహిళా సంఘాలకు జగనన్న ప్రభుత్వంలో రూ.91.76 కోట్ల లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక తెలిపారు. నాగార్జునరెడ్డితో పాటు మహిళా సంఘాల సభ్యులతో సమావేశమైన ఆమె మాట్లాడుతూ.. సున్నావడ్డీ కింద రూ.3.66 కోట్లను ఆయా మహిళా సంఘాల సభ్యుల బ్యాంక్ ఖాతాల్లోకి ప్రభుత్వం నేరుగా జమ చేసిందన్నారు. వైఎస్సార్ ఆసరా కింద ఈ మూడేళ్లలో రూ.18.96 కోట్లను మహిళా సంఘాలకు ప్రభుత్వం అందజేసిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం వెలుగు కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు.

వివాహిత హత్య



హతురాలు రత్నమ్మ

పుట్టపర్తి రూరల్: మండలంలోని ఎనుములపల్లిలో ఓ వివాహిత హత్యకు గురైంది. సీఐ కొండారెడ్డి తెలిపిన మేరకు... ఎనుములపల్లి బీసీ కాలనీకి చెందిన రత్నమ్మ (55), రామకృష్ణ దంపతులు చిప్స్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలున్నారు. ఒకరికి పెళ్లై అత్తారింటిలో ఉండగా... మరో ఇద్దరు చదువుల కోసం హాస్టల్‌లో ఉంటున్నారు. కొంత కాలంగా రామకృష్ణ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న విషయం పసిగట్టిన రత్నమ్మ పలుమార్లు తన భర్తను వారించింది. అయినా అతనిలో మార్పు రాలేదు. మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో తన భార్యను అడ్డు తొలగించుకోవాలని భావించిన రామకృష్ణ.. అర్ధరాత్రి దాటిన తర్వాత రత్నమ్మ నోట్లో బలవంతంగా బట్టలు కుక్కి తలపై రాడ్‌తో బాది హతమార్చాడు. అనంతరం మిద్దెపై ఉన్న రక్తపు మరకలు తుడిచేసి ఆ గుడ్డను పక్కనున్న మిద్దెపై విసిరేశాడు. ఆమె మృతదేహాన్ని పైనుంచి కిందపడేసి, ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించే ప్రయత్నం చేసి, అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. బుధవారం తెల్లవారిన తర్వాత ఇంటి ఆవరణలో విగతజీవిగా పడి ఉన్న రత్నమ్మను గమనించిన స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై హతురాలి సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కీచక గురువు మాకొద్దు

- ఝాన్సీ లక్ష్మీబాయి స్కూల్ ఉపాధ్యాయుడి వెకిలి చేష్టలు

గుంతకల్లు టౌన్: పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పాల్సిన గురువే కీచకుడిగా మారాడు. తన కూతురు వయసున్న విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన గుంతకల్లులోని ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వెలుగుచూసింది. వివరాలు... గుంతకల్లులోని మార్కెట్ వెనుక ఉన్న ఝాన్సీ లక్ష్మీబాయి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 26 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో ఏడుగురు విద్యార్థినులు ఉన్నారు. సింగిల్ టీచర్ కలిగిన ఈ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న కుళ్లాయప్ప కొన్ని నెలలుగా విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో విసుగు చెందిన విద్యార్థినులు విషయాన్ని మంగళవారం తల్లిదండ్రుల వద్ద మొరపెట్టుకుని తాము ఆ స్కూల్‌కు వెళ్లబోమంటూ మొరాయించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ మస్తాన్‌రావు ఆ స్కూల్ వద్దకు చేరుకుని విచారణ చేస్తుండగా పలువురు తల్లిదండ్రులు అక్కడకు చేరుకుని తమ పిల్లలకు టీసీలిచ్చేస్తే మరో స్కూల్‌లో చేర్పించుకుంటామంటూ విన్నవించారు. దీనిపై స్పందించిన మస్తాన్‌రావు సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని భరోసానివ్వడంతో వివాదం అప్పటికి సద్దుమణిగింది. అయితే ఆ ఉపాధ్యాయుడిని బదిలీ చేయకుండా యథావిధిగా కొనసాగిస్తున్నారని తెలుసుకున్న తల్లిదండ్రులు బుధవారం ఉదయం పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతిరెడ్డి వెంటనే వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్యతో కలసి పాఠశాల వద్దకు చేరుకుని, ఆందోళనకారులతో చర్చించారు. జరిగిన దుశ్చర్య తెలుసుకుని సదరు ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు బదిలీ చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేయాలని ఎంఈఓకు సూచించారు. దీంతో డిప్యుటేషన్‌పై కుళ్లాయప్పను మరో పాఠశాలకు బదిలీ చేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. కాగా, ఘటనకు సంబంధించి ఉపాధ్యాయుడు కుళ్లాయప్ప వివరణ ఇస్తూ తనను విద్యార్థినులు తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. క్లాస్‌రూమ్‌లో అల్లరిని నియంత్రించడంలో భాగంగా ఓ విద్యార్థిని చెయ్యి తగలడంతో మిగిలిన పిల్లలు చూసి దుష్ప్రచారం చేశారని వాపోయారు.

అల్లుడి ఘాతుకం

- మామపై కొడవలితో దాడి
- చికిత్స పొందుతూ మృతి



హతుడు సుంకిరెడ్డి

తాడిపత్రి: అల్లుడు కొడవలితో విచక్షణారహితంగా దాడి చేయడంతో మామ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. తాడిపత్రి మండలం కోమలి గ్రామానికి చెందిన వీర రాఘవరెడ్డికి శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన సుంకిరెడ్డి(63) కుమార్తె రాజేశ్వరితో వివాహమైంది. కొన్ని రోజులుగా సుంకిరెడ్డి మతిస్థిమితంలో కోల్పోయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండడంతో అప్పుడప్పుడు ఆ గ్రామానికి సుంకిరెడ్డి చేరుకుని కుమార్తె బాగోగులు చూసుకునేవారు. అల్లుడిని చికిత్స నిమిత్తం ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం కోమలికి చేరుకున్న ఆయన వీరరాఘవరెడ్డిని చికిత్స కోసం బెంగళూరుకు పిలుచుకెళ్లి మంగళవారం తిరిగొచ్చారు. బుధవారం ఉదయం అల్లుడికి చెందిన కంది పొలంలో పంటకు పురుగుల మందు పిచికారీ చేయిస్తుండగా అదే సమయంలో అక్కడకు చేరుకున్న వీరరాఘవరెడ్డి కొడవలితో సుంకిరెడ్డిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సుంకిరెడ్డిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. ఘటనపై తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బ్రాహ్మణపల్లి తండాలో చైన్‌స్నాచింగ్



బాధితుడు జయరాం నాయక్

పుట్టపర్తి రూరల్: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని బ్రాహ్మణపల్లి తండాలో చైన్‌స్నాచింగ్ జరిగింది. గ్రామానికి చెందిన వృద్ధుడు జయరాంనాయక్ బుధవారం ఉదయం 6.30 గటలకు వాకింగ్ చేస్తుండగా విమానాశ్రయం సమీపంలోని స్కూల్ మలుపు వద్ద ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో వచ్చి ఆయనను కిందకు తోసి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, మంగళవారం రాత్రి ఎనుములపల్లి గణేష్ సర్కిల్ వద్ద దుకాణం నిర్వహిస్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేందుకు దుండగులు విఫలయత్నం చేసినట్లు సమాచారం.

రైతులకు వ్యాపారి శఠగోపం

- రూ.12 కోట్ల వరకు బకాయిలు
- లబోదిబోమంటున్న బాధిత రైతులు

కణేకల్లు: మాల్యం గ్రామానికి చెందిన ఓ వ్యాపారి రైతులకు శఠగోపం పెట్టారు. శనగలు విక్రయించిన రైతులకు రూ.12 కోట్ల వరకు బకాయి పెట్టి పరారయ్యాడు. మండలంలోని సొల్లాపురం, ఎన్.హనుమాపురం, నింబగల్లు, మాల్యం, తుంబిగనూరు తదితర గ్రామాల్లో సదరు వ్యాపారి రైతుల నుంచి అనామాతు(అప్పు)పై శనగలు కొనుగోలు చేశాడు. అయితే డబ్బు చెల్లింపు విషయంలో కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో రైతుల్లో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో రైతుల నుంచి డబ్బుల కోసం ఒత్తిడి పెరగడంతో వ్యాపారి కుటుంబంతో కలిసి ఊరు విడిచి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న రైతులు లబోదిబోమంటున్నారు. పలువురు బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.

జనవాక్కు

జీవనోపాధి మెరుగు పడింది



డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా ఉంటూ బ్యాంక్ లింకేజీ రుణం తీసుకున్నా. జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రుణమాఫీ డబ్బు పడడంతో నా భర్త, కోడలు సహకారంతో మా ఊళ్లోనే ఓ చిన్నపాటి దుకాణం నడుపుతున్నా. అవసరమైన సరకులను బాగేపల్లి, చిలమత్తూరు, హిందూపురం నుంచి తీసుకొస్తున్నాం. ఇప్పుడు మా జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన పథకాలు మా కుటుంబానికి కలిసొచ్చాయి. ఆర్థిక ఇబ్బందులు పూర్తిగా తొలిగిపోయాయి.

– లక్ష్మీదేవమ్మ, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

సొంతిల్లు మంజూరైంది



పదేళ్ల క్రితం పెళ్లి చేసుకుని అత్తారింట్లో కాలుపెట్టాను. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో సొంతింటి కోసం లెక్కకు మించి అర్జీలు ఇచ్చాను. జన్మభూమి కమిటీ సమావేశాల్లో ఇచ్చిన ప్రతి దరఖాస్తూ చెత్త కుప్ప పాలైంది. కానీ ఇల్లు మాత్రం మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత సంక్షేమ పథకాలతో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. నా పేరుతో ఇంటి పట్టా ఇవ్వడమే కాక, గృహ నిర్మాణాన్నీ మంజూరు చేశారు. ప్రస్తుతం గృహ నిర్మాణం పూర్తి కావొస్తోంది. మాకు మేలు చేసిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటా.

– అంజలి, తెనగల్లు, కుందుర్పి మండలం

సొంతింటి కల నెరవేరింది



మాది ఉమ్మడి కుటుంబం. ఇరుకు ఇంట్లోనే ఇబ్బంది పడుతున్నాం. గతంలో పక్కా ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంతంగా ఇంటిని నిర్మించుకోలేక పోయాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగనన్న కాలనీలో మాకు నివేసన స్థలం ఇచ్చి, గృహ నిర్మాణాన్ని మంజూరు చేశారు. ఇల్లు నిర్మించుకున్నాం. సొంతింటి కల నెరవేరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేలు మరవలేం.

– లక్ష్మీబాయి, కూడేరు

ఇంత గొప్ప సీఎం ఎన్నటికీ రాడు



ఈ చిత్రంలో మీరు చూస్తున్న వ్యక్తి పేరు రాఘవేంద్ర. కుందుర్పి మండలం కెంచంపల్లి గ్రామం. పుట్టకతోనే మూగ, చెవుడుతో బాధపడుతున్నాడు. అదే వైకల్యంతో బాధపడుతున్న యువతిని పెళ్లి చేసుకున్నాడు. ప్రభుత్వం, ఆర్డీటీ సహకారంతో బీటెక్ పూర్తి చేశాడు. జగనన్న ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇద్దరికీ సామాజిక పింఛన్ అందుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద మందులు, వినికిడి యంత్రాలు ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం జగన్ పాలనపై ఆయన పేపర్లో రాస్తూ.. ఇంతటి గొప్ప ముఖ్యమంత్రి ఎన్నటికీ రాడని, జగన్ లాంటి వ్యక్తి మనకు సీఎం కావడం అందరి అదృష్టమని పేర్కొన్నారు.

అలరించిన సంగీత కచేరి



సత్యసాయిని కీర్తిస్తూ గానం చేస్తున్న అనకాపల్లి భక్తులు

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన అనకాపల్లి సత్యసాయి భక్తులు బుధవారం సత్యసాయి మహాసమాధి చెంత నిర్వహించిన సంగీత కచేరి అలరించింది. అనంతరం భక్తులు మహాసమాధిని దర్శించుకున్నారు.

హిజ్రాపై కేసు నమోదు

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలను వేధిస్తూ బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్న హిజ్రాపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. కళ్యాణదుర్గానికి చెందిన గాయత్రి మంగళవారం రాత్రి పావగడకు వెళ్లేందుకు సిద్ధమై పిల్లలతో సహా బస్టాండుకు చేరుకుని చేరుకుని బస్సు ఎక్కింది. ఆ సమయంలో అదే బస్సు ఎక్కిన హిజ్రా అంకిత డబ్బు కోసం గాయత్రిని తీవ్ర ఒత్తిడి చేసింది. దీంతో అసహనానికి గురైన ఆమె పర్సు తీసి డబ్బు ఇచ్చేలోపు దానిని లాక్కొని అందులోని రూ.500 తీసుకెళ్లింది. దౌర్జన్యాన్ని గాయత్రి నిలదీస్తూ డబ్బు తిరిగివ్వాలని కోరితే తనదైన శైలిలో హంగామా చేస్తూ రాయలేని మాటల్లో దూర్భాషలాడింది. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, బలవంతపు వసూళ్లకు పాల్పడే హిజ్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు.

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

అనంతపురం క్రైం: వివాహితను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఆమె భర్త, అత్తమామను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను అనంతపురం త్రీ టౌన్ పోలీసులు వెల్లడించారు. ఈ నెల 3న అనంతపురంలోని రజకనగర్‌లో నివాసముంటున్న వలంటీర్ మాధవి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఘటనకు సంబంధించి మాధవి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అదనపు కట్నం వేధింపులతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. ఇందుకు కారకులైన భర్త మారుతి, ఆయన తల్లిదండ్రులను బుధవారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.